సాక్షి
ఒడిశా

సోమవారం । 21 । అక్టోబర్ । 2024



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు : రూ. 5,07,539

బంగారం : 5 గ్రాముల 150 మిల్లీ గ్రాములు

వెండి : 30 గ్రాముల 500 మిల్లీ గ్రాములు

– భువనేశ్వర్/పూరీ

ఊరి పేరేదీ..?

భువనేశ్వర్: తూర్పు కోస్తా రైల్వేలో అనగనగా ఒక ఊరు. ఆ ఊరు పేరు లేకుండానే చెలామణీ అయిపోతోంది. సంబలపూర్ రైల్వే మండలంలో ఉన్న ఆ ఊరి అసలు పేరు నరసింఘ్‌గొడా. ఖుర్దారోడ్ – బొలంగీరు మార్గంలో ఈ స్టేషను ఉంది. నిత్యం సూపర్ ఫాస్టు, ఎక్స్‌ప్రెస్, సాధారణ శ్రేణి రైళ్లు వెళ్తుంటాయి. అయినా స్టేషన్‌లో ఊరి పేరు ఎక్కడా కనిపించడం లేదు.



ఊరు పేరు లేని స్టేషను



పేరు నోచుకోని స్టేషను భవనం

న్యూస్‌రీల్

రాహుల్ గాంధీతో ఎంపీ ఉల్కా భేటీ



రాహుల్ గాంధీతో కరచాలనం చేస్తున్న ఎంపీ ఉల్క

కొరాపుట్: రాహుల్ గాంధీతో కొరాపుట్ పార్లమెంట్ సభ్యుడు సప్తగిరి ఉల్క భేటీ అయ్యారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన సంవిదాన్ సమ్మాన్ సమ్మేళన్‌లో ఈ భేటీ జరిగింది. మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడిగా ఉన్న ఉల్క అక్కడి పరిస్థితిని రాహుల్‌కి వివరించారు. అంతకుముందు జార్ఖండ్ ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ సమావేశం సీనియర్ నాయకుడు గులాం మీర్ ఆహ్మద్ మీర్ ఆధ్వర్యంలో జరిగింది.

సివిల్స్ సాధించిన బొండాజాతి యువతి



బిన్ని ముదులి

భువనేశ్వర్: ఒడిశా పబ్లిక్ సర్వీసు కమిషన్ తాజాగా ప్రకటించిన ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీసు (సివిల్స్) పరీక్షల్లో తొలిసారిగా ఆదిమ దళిత బొండా జాతి యువతి బిన్ని ముదులి ఉత్తీర్ణత సాధించింది. ఆమె ఉత్తీర్ణతపై రాష్ట్ర షెడ్యూల్డు కులం, తెగల అభివృద్ధి, వెనుకబడిన వర్గాల సంక్షేమ శాఖ మంత్రి నిత్యానంద గోండ్ ప్రత్యేకంగా అభినందించారు. బిన్ని ఉత్తీర్ణత సమగ్ర బొండా జాతికి గర్వకారణమన్నారు. ఇతరులకు ప్రేరణాత్మకంగా ఆమె ఉజ్వల భవిష్యత్‌తో వెలుగొందాలని మంత్రి అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: స్థానిక అగ్రసేన్ భవనంలో మణిపాల్ హస్పిటల్స్ భువనేశ్వర్ ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ మేఘా ఆస్పత్రి ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొరాపుట్ జిల్లా ప్రజలకు వైద్య సేవలు చేరువ చేసేందుకు ఇటువంటి వైద్య శిబిరాల నిర్వహణ ఎంతో అవసరమన్నారు. శిబిరంలో మొత్తం 150 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో కార్డియాలజిస్టు డా.దివ్యరంజన్ బాలు, న్యూరాజిస్టు డా.దీపక్ పాణిగ్రహి, ఆర్థోపెడిస్ట్ డా.దినేష్ మిశ్ర తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణా చేస్తున్న యువతి అరెస్టు

కొరాపుట్: గంజాయి అక్రమ రవాణా చేస్తున్న యువతిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం కొరాపుట్ రైల్వేస్టేషన్‌లో మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్‌కి చెందిన సంజు విశ్వకర్మ అనే యువతి సూట్ కేస్‌తో సమలేశ్వరి రైలు ఎక్కేందుకు వేచి ఉంది. ఆమె అనుమానాస్పదంగా కనిపించడంతో జీఆర్‌పీ పోలీసులు తనిఖీ చేయగా 14 కేజీల గంజాయి పట్టుబడింది. గంజాయి సీజ్ చేసి నిందితురాలిని కోర్టుకు తరలించారు.

వృద్ధురాలి హత్య



నిందితుడు శ్రీరాం దురు

కొరాపుట్: ముక్కుపుడకల కోసం వృద్ధురాలిని దారుణంగా హత్య చేసిన ఘటన కందుగుడ గ్రామ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి ఆదివారం కొరాపుట్ జిల్లా నందపూర్ ఎస్‌డీపీ పరిధిలోని పాడువా పోలీసులు వివరాలు వెల్లడించారు. కందుగుడ గ్రామానికి చెందిన మలే కిలో(64) అనే వృద్ధురాలితో కలిసి కంటాసురు గ్రామానికి చెందిన శ్రీరాం దురు అనే యువకుడు మద్యం తాగాడు. కొద్దిసేపటి తర్వాత వృద్ధురాలి ముక్కుపుడక కోసం హత్య చేసి వ్యవసాయ పొలంలో పడేశాడు. ఆమె వద్ద ఉన్న రూ.1300 నగదు తీసుకుని పరారయ్యాడు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

తుఫాన్ అలర్ట్

- బంగాళాఖాతంలో తుపాను దానా: ఐఎండీ
- ఈ నెల 24న తీరం దాటే అవకాశం



భువనేశ్వర్: బంగాళాఖాతంలో తుఫాన్ వాతావరణం అలముకుంటోంది. ఈసారి తీరం దాటనున్న తుఫాన్‌ను దానాగా పేర్కొన్నట్లు భారత వాతావరణ శాఖ డైరెక్టరు జనరల్ డాక్టరు మృత్యుంజయ మహాపాత్రో తెలిపారు. మధ్య అండమాన్ సముద్రంలో ఆదివారం ఉదయం ఏర్పడిన వాయుగుండం రానున్న 24 గంటల్లో అల్ప పీడనంగా మారనుంది. ఈ నెల 22 నాటికి అల్ప పీడనంగా బలపడి బుధవారానికి బంగాళాఖాతంలో తుఫాన్‌గా పరిణతి చెందుతుందని తెలిపారు. పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ మర్నాడు ఈ నెల 24వ తేదీన ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల మధ్య వాయువ్య బంగాళా ఖాతంలో తీరం దాటుతుందని భారత వాతావరణ శాఖ సమాచారం. పూరీ సాగర తీరం దాటి భువనేశ్వర్ పరిసర ప్రాంతాల్ని ప్రభావితం చేస్తుందని అంచనా వేస్తున్నారు. తుఫాన్ ప్రభావంతో ఈ నెల 23 నుంచి వర్షం కురుస్తుందని, తదుపరి 2 రోజులు తీవ్రస్థాయిలో వర్షపాతం నమోదవుతుందని చెబుతున్నారు.

బలమైన గాలులు

దానా తుఫాన్ తీరం దాటే సమయంలో గాలులు వేగం పుంజుకుంటాయి. ఈ సమయంలో గాలుల వేగం గంటకు 100 కిలో మీటర్ల నుంచి 120 కిలో మీటర్ల వరకు ఉంటుందని అంచనా.

సముద్రం అల్లకల్లోలం

ఈ వాతావరణం ప్రభావంతో సముద్రంలో వాతావరణం అల్లకల్లోలంగా ఉంటుంది. సోమవారం నుంచి గాలుల వేగం గంటకు 45 కిలోమీటర్లు ఉంటుంది. బుధవారానికి గంటకు 65 నుంచి 75 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. గురువారం గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

మత్స్యకారులకు హెచ్చరిక

బంగాళాఖాతంలో తీవ్రమైన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా మత్స్యకారులు సముద్రం వైపు వెళ్లరాదని భారత వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ నెల 26వ తేదీ వరకు సముద్రంలో చేపల వేట నివారించాలని ముందస్తు సమాచారం జారీ చేసింది. ఈ మేరకు చర్యలు చేపట్టాలని గంజాం, పూరీ, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్, భద్రక్, బాలాసోర్ ప్రాంతాల కలెక్టర్లకు రాష్ట్ర అదనపు ప్రత్యేక సహాయ కమిషనరు పద్మనాభ బెహరా లేఖలు జారీ చేశారు.

కోస్తా ప్రాంతాల్లో వర్షాలు

తుఫాన్ అలజడితో ఆంధ్రప్రదేశ్, ఒడిశా, పశ్చిమ బెంగాలు తదితర తీర ప్రాంతాల్లో భారీగా వర్షం కురుస్తుందని సమాచారం. ఈ నెల 23 నుంచి ప్రారంభమయ్యే వర్షాల తీవ్రత 24 నాటికి పెరుగుతుందని, కుండపోత వాన సంకేతాలు ఉన్నాయని వాతావరణ శాఖ చెబుతోంది.

అక్టోబర్ అంటేనే డర్

భువనేశ్వర్: అక్టోబర్ వస్తే చాలు ఒడిశా ఉలిక్కి పడుతుంది. ఏటా అక్టోబర్ నెలలో వచ్చే ప్రకృతి వైపరీత్యాలే ఈ భయానికి కారణం. 1999 సంవత్సరం అక్టోబరు నెలలో సంభవించిన పెను తుఫాన్ ఆనవాళ్లు జనం గుండెల్లో ఇంకా కదలాడుతున్నాయి. తరచూ అక్టోబరు నెలలో ఇక్కడే తుఫాన్లు వస్తున్నాయి. తాజాగా మరోసారి ఈ నెలలో దానా తుఫాన్ తీరం దాటనుందనే వార్తలు బలపడుతున్నాయి.

అక్టోబర్ తుఫాన్లు ఇవే..

- 1999 అక్టోబరు 29న సంభవించిన పెను తుఫాన్ తీవ్ర వినాశనం సృష్టించింది.
- 2013 అక్టోబరు నెల 12వ తేదీ రాత్రి పూట ఫైలీన్ తుఫాన్ గోపాలపూర్ ప్రాంతంలో సముద్ర తీరం దాటింది.
- 2014 అక్టోబరు 12న హుదూద్ తుఫాన్ విశాఖపట్నంలో తీరం దాటి రాష్ట్రాన్ని ప్రభావితం చేసింది.
- 2018 అక్టోబరు నెల 11న ఉత్తరాంధ్ర, ఒడిశా సరిహద్దు తీరం దాటి గోపాలపూర్‌కు నైరుతి దిశలో రాష్ట్రంలో తీవ్ర అలజడి రేపింది.
- 2019 మే నెలలో ఫణి తుఫాన్ పూరీ తీరంలో తీవ్ర కలకలం రేపింది.
- ప్రధానంగా గంజాం, పూరీ, ఖుర్దా, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్ 5 ప్రధాన కోస్తా తీర ప్రాంతాలు తుఫాన్, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాల కోరల్లో చిక్కుకుని తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి.
- ఈ నెలలో తీరం దాటనున్న తాజా తుఫాన్‌కు కతార్ దానాగా నామకరణం చేసింది. అరబిక్ భాషలో దానా అంటే అమూల్య ముత్యం. ఈ తుఫాన్ ప్రభావంతో గంటకు 100 కిలో మీటర్ల వేగం పైబడి గాలులు వీస్తాయని అంటున్నారు.

కొత్త ప్రభుత్వం ఎదుర్కోగలదా..?

రాష్ట్రంలో తొలిసారిగా పాలన పగ్గాలు చేపట్టిన భారతీయ జనతా పార్టీ ప్రభుత్వానికి దానా తుఫాన్ పెను సవాలు. విపత్తు నిర్వహణలో గత ప్రభుత్వం యునెస్కో వంటి అంతర్జాతీయ ప్రతిష్టాత్మక సంస్థల మన్ననలు పొందడంతో ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచింది. ప్రకృతి వైపరీత్య పరిస్థితుల సంకేతాల అలికిడి ఆరంభం నుంచి శూన్య ప్రాణ హాని నినాదంతో గత ప్రభుత్వం ముందస్తు సన్నద్ధత కార్యకలాపాల్లో సామాన్య ప్రజానీకం సైతం భాగస్వాములుగా పాల్గొనే రీతిలో అవగాహన పరిచేది. బీజేపీ ఎలా ఎదుర్కొంటుందో చూడాలి.

ఓఏఎస్ ఫలితాల్లో బడుగుల ప్రతిభ



శ్యామ్ మాడి



పిలోహులికా ప్రియదర్శిని



భాగ్యశ్రీ మిత్రో



పల్లవి సర్కార్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లాకు చెందిన గిరిజన తెగల్లో బోండ, కోయ్యా తెగలకు చెందిన వారు ఓఏఎస్ పరీక్షల్లో ప్రతిభ చూపారు. కోరుకొండ సమితి పోట్రేల్ గ్రామానికి చెందిన శ్యామ్ మాడి రాష్ట్ర స్థాయిలో 631వ ర్యాంకు సాధించాడు. ఖోయిర్‌పూట్ సమితి ఖేమాగురు గ్రామానికి చెందిన బిని ముదులి 596 స్థానంలో నిలిచింది. ముదిలి తల్లి అంగన్‌వాడీలో పనిచేస్తారు. తండ్రి పాఠశాలలో వంట మనిషి. మత్తిలి సమితి మోండుకూలి గ్రామానికి చెందిన భాగ్యశ్రీ మిశ్రోకు 138వ ర్యాంకు వచ్చింది. మల్కన్‌గిరికి చెందిన పల్లవి సర్కార్‌కు 317వ ర్యాంక్ రాగా, పిలోహులికా ప్రియదర్శిని 484 వ ర్యాంకు సాధించింది.



తల్లిదండ్రులతో బిని ముదిలి

చిక్కిన గూఢచారి పావురం..?



మత్స్యకారుడికి చిక్కిన పావురం

భువనేశ్వర్: రాష్ట్రంలో విహరిస్తున్న ఒక గూఢచారి పావురం ఆదివారం మత్స్యకారునికి చిక్కింది. దీని కాలుకి అమర్చి ఉన్న పట్టీతో సందిగ్ధత నెలకొంది. మత్స్యకారుడు పోలీసులకు ఈ పావురం అప్పగించాడు. వారు దీనిని అటవీ శాఖ అధికారులకు అప్పగించాడు. పావురం కాలుకు అమర్చిన పట్టీలో ఉన్న రహస్య సందేశం ఏమిటి? ఈ సందేశం ఆంతర్యం ఏమిటి? ఎవరి కోసం ఈ సందేశం ప్రసారం అవుతుంది? ఇలా పలు సందిగ్ధ కోణాల్లో విచారణ జరగాల్సి ఉందని పలు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

వివరాల్లోకి వెళ్తే.. కేంద్రాపడా జిల్లా మహాకలపడా మండలం జంభూ గ్రామం తరం సముద్రంలో చేపలు వేటాడుతున్న సమయంలో పడవపై పావురం వాలింది. దీనిని మత్స్యకారుడు రతన్ దాస్ అక్కున చేర్చుకుని ఇంటికి బయల్దేరాడు. సంరక్షించేందుకు ఇంటికి తీసుకు వస్తున్న సమయంలో కాలికి పట్టీ కట్టినట్లు దృష్టికి వచ్చింది. ఈ పట్టీ మీద సీహెచ్ – 19 – 2024 మరియు 988822 అని రాసి ఉన్నట్లు గుర్తించారు. దీని వెనక దాగి ఉన్న రహస్యంపై సర్వత్రా సందిగ్ధత నెలకొంది. పట్టీపై రాతల ప్రాథమిక సూచనగా ఈ పావురం చైనా లేదా బంగ్లాదేశ్‌కు చెందిన గూఢచర్య కార్యకలాపాలకు సారథిగా అనుమానిస్తున్నారు. రాష్ట్రంలో లోగడ ఇటువంటి సంఘటనలు పలుమార్లు సంభవించాయి.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సేవా పేపరు మిల్లు గేటు ముందు ఆందోళన నిర్వహిస్తున్న మహంతి, పంజియ, తదితరులు

జయపురం: ఈ నెల 21వ తేదీన స్థానిక జిల్లా లేబర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టనున్నట్లు సేవా పేపరు మిల్లు ప్రథమ యూనియన్ అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ మహంతి, కార్యదర్శి ప్రదీప్ కుమార్ పంజియ ఆదివారం వెల్లడించారు. ఈ మేరకు డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు. సుమారు ఐదేళ్ల నుంచి మిల్లు యాజమాన్యం కార్మికులను అనేక ఇబ్బందులకు గురుచేస్తోందని ఆరోపించారు. లేబర్ అధికారులు యాజమాన్యంపై న్యాయపరమైన చర్యలు తీసుకోని ఉంటే సమస్యలు పరిష్కారమయ్యేవన్నారు. లేబర్ కార్యాలయ అధికారులు ఈ సమస్య పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు. కార్మికులు తమ గ్రాట్యుటీపై ఈ ఏడాది ఫిబ్రవరిలో కేసులు దాఖలు చేయటం జరిగిందని, నేటివరకు కేసులు పరిష్కరించలేదన్నారు. ఆగస్టు 12, 13, 14 తేదీలలో చర్చించి గ్రాట్యుటీ కేసులు ఫైనల్ చేసినా.. నేటివరకు వాటిపై ఆదేశాలు ఇవ్వలేదన్నారు. గ్రాట్యుటీ అందకుండానే 36 మంది విశ్రాంత కార్మికులు మరణించారన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈ ఏడాది జూలై నుంచి మిల్లు ప్రధాన గేటు వద్ద ముఖాలకు నల్ల బ్యాడ్జీలు కట్టుకొని ఆందోళన చేస్తున్నామన్నారు. బిజినెస్ ట్రాన్స్‌ఫర్ అగ్రిమెంట్ అమలు చేయకుండా యాజమాన్యం దాటవేసిందని ఆరోపించారు.

పిడుగు పడి చిన్నారి మృతి



చికిత్స పొందుతున్న కోమల దూరి



పిడుగులు పడిన సమయంలో మెరుపులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి దూలిపూట పంచాయతీ ఇస్కమండ గ్రామంలో శనివారం సాయంత్రం పిడుగుపడి 8 ఏళ్ల చిన్నారి సరోజ దూరి(8) మృతి చెందింది. వివరాల్లోకి వెళ్తే.. వరుసకు పిన్ని అయ్యే కోమల దూరితో సరోజ దూరి (8) ఆవులు మేపడం కోసం సమీప అడవికి వెళ్లారు. అయితే శనివారం సాయంత్రం భారీగా వర్షం కురవడంతో వడగాల్పులతో పిడుగు పడింది. పిడుగు పాటుకు సరోజ అడవిలోనే మృతి చెందింది. దీంతో స్థానికులు వెంటనే జాన్‌బాయి వద్ద నున్న ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అప్పటికే సరోజ మృతి చెందినట్లు తెలిపారు. అలాగే కోమలకు తీవ్రంగా గాయాలవ్వడంతో చిత్రకొండ ఆరోగ్య కేంద్రానికి తరలించారు. చిత్రకొండ ఐఐసీ ముకుందో మేల్క ఆరోగ్య కేంద్రానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

కార్మికులపై పిడుగుపాటు

జయపురం: జయపురం సబ్‌డివిజన్ బొయిపరిగుడలోగల నీలగిరి కలప గిడ్డంగి వద్ద కూలీలు పని చేస్తున్న సమయంలో ఆదివారం పిడుగులు పడ్డాయి. ఈ సంఘటనలో నలుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఆ సమయంలో 14 మంది కార్మికులు నీలగిరి కలప గిడ్డంగి వద్ద పనిచేస్తున్నారు. కలపను ట్రక్కులోనికి లోడు చేస్తుండగా అకస్మాత్తుగా భీకర శబ్దంతో పిడుగులు పడ్డాయి. దీంతో నలుగురు అక్కడే సొమ్మసిల్లిపడిపోయారు. వెంటనే మిగిలిన కార్మికులు గిడ్డంగి యజమానికి కబురు చేశారు. ఆయన వచ్చి క్షతగాత్రులను వెంటనే బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు: మంత్రి

భువనేశ్వర్: బంగాళాఖాతంలో అనుక్షణం చోటు చేసుకుంటున్న వాతావరణ మార్పులతో రాష్ట్రంలో దానా తుఫాన్ తీరం దాటే సంకేతాలు బలపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కూరగాయలు, ఆకు కూరలు ఇతర నిత్యావసర సామగ్రి కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు చేపడతామని రాష్ట్ర పౌర ఆహార సరఫరా, వినియోగదారుల సంక్షేమ శాఖ మంత్రి కృష్ణ చంద్ర పాత్రో ఆదివారం వ్యాపార వర్గాలను హెచ్చరించారు. తుఫాన్ తీవ్రత నేపథ్యంలో రైతులు పొలాల్లో కూరగాయల పంటల్ని ముందస్తుగా సంరక్షించుకోవాలని తీర ప్రభావిత ప్రాంతాల జిల్లా కలెక్టర్లు ముందస్తుగా సూచించారు. అపార పంట నష్టం నివారణ దిశలో స్వీయ అవగాహనతో పొలాల్లో పంటలతో పాడి పశువులు, కోళ్ల వంటి జీవరాశుల పరిరక్షణపై జాగ్రత్త వహించాలని తెలిపారు.

బాల కార్మికులకు విముక్తి

పర్లాకిమిడి: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు ఏరుతున్న ముగ్గురు బాలలను చైల్డ్‌లైన్ అధికారులు పట్టుకున్నారు. జిల్లా శిశు సురక్ష సమితి అధికారులకు ఆదివారం అప్పగించారు. కలెక్టర్ బిజయకుమార్ దాస్ ఆదేశాల మేరకు బాలలను బాలాశ్రమం పునరావాస కేంద్రానికి తరలించామని జిల్లా శిశు సుర‌క్షాధికారి అరుణ్‌కుమార్ త్రిపాఠి తెలిపారు.

హాస్టల్‌లో అసౌకర్యాలపై దర్యాప్తు



విద్యార్థులతో మాట్లాడుతున్న సూరజ్ నాయక్

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధిలో పొగాడిబిలి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల హాస్టల్లో మౌలిక సౌకర్యాలు మెరుగుపరచాలని విద్యార్థులు రెండు రోజుల కిందట నిరసనకు దిగిన సంగతి తెలిసిందే. ఈ మేరకు సబ్ డివిజన్ సంక్షేమ శాఖాధికారి సూరజ్‌నాయక్ శనివారం సాయంత్రం పాఠశాలను సందర్శించి వివరాలు సేకరించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యత లేని ఆహారాన్ని అందిస్తున్నారని, మరుగుదొడ్ల శుభ్రం చేయించాలని కోరినా పట్టించుకోవడం లేదని చెప్పారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఇంటికి వెళ్లిపోమని చెబుతున్నారని వాపోయారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తానని సూరజ్ స్పష్టం చేశారు..

చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

రాయగడ: స్థానిక స్పందన సాహితీ, సాంస్కృతిక సంస్థ 28వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం రామలింగేశ్వర ఆలయం ప్రాంగణంలో చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. వివిధ పాఠశాలకు చెందిన 87 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో స్వర్గీయ రతన్ టాటా చిత్రం అద్భుతంగా రూపొందించిన విద్యార్థులకు సంస్థ నిర్వాహకులు ప్రత్యేకంగా ప్రశంసించారు. జూనియర్, సీనియర్ విభాగాలుగా విభజించి నిర్వహించిన ఈ పోటీల్లో విద్యార్థులు తమ సృజనాత్మకకు అద్దం పట్టేలా బొమ్మలను గీసారు. సంస్థకు చెందిన భళ్లమూడి నాగరాజు, కె.కె.ఎం.పట్నాయిక్, తులసీదాస్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. వచ్చే నెల 10వ తేదీన జరిగే వార్షికోత్సవ సభలో విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు సంస్థ అధ్యక్షుడు గుడ్ల గౌరి శంకర్ ప్రసాద్ తెలియజేశారు.

మిల్లెట్ శక్తి కేఫ్ పరిశీలన

జయపురం: మండియ (చోళ్ల)తో తయారు చేసే ఆహార పదార్థాలు ప్రజలకు విక్రయించేందుకు ఏర్పాటు చేస్తున్న మిల్లెట్ శక్తి కేఫ్‌ను త్వరలో జయపురం ప్రజలకు అందుబాటులోకి రానుంది. రూ.18 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న మిల్లెట్ శక్తి కేఫ్‌ను జయపురం మునిసిపాలిటీ కార్యనిర్వాహక అధికారి సిద్ధార్థ పట్నాయిక్ ఆదివారం పరిశీలించారు. ఈ కేఫ్‌లో మండియ (చోళ్ల)తో తయారు చేసే ఆహార పదార్థాలు అమ్మటం జరుగుతుందన్నారు. చోళ్లతో తయారు చేసే వివిధ రకాల అల్పాహారాలు, బిస్కెట్లు, మిక్చర్ తదితర పోషక ఆహార పదార్థాలు అందుబాటులో ఉంటాయని వెల్లడించారు. ఈ కేఫ్‌ను మహిళా స్వయం సహాయక గ్రూపులు నిర్వహిస్తాయని, మహిళలకు ఉపాధి కలుగుతుందన్నారు. చోళ్లు, ఇతర చిరు ధాన్యాలతో తయారు చేసే ఆరోగ్యవంతమైన ఆహార పదార్థాలు జయపురం ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. అదనపు కార్యనిర్వాహక అధికారి కృతిబాష్ సాహు, ఇంజినీర్ అజయ్ జాని తదితరులు ఉన్నారు.



మిల్లెట్ శక్తి కేఫ్‌ను పరిశీలిస్తున్న కార్యనిర్వాహక అధికారులు

30న ధన్వంతరి జయంతి



మాట్లాడుతున్న కవిరాజ్ పరమేశ్వర పాత్రో

జయపురం: ఆయుర్వేద ఔషధ దేవుడిగా పూజించే ధన్వంతరి జయంతిని ఈ నెల 30వ తేదీన ఘనంగా నిర్వహించాలని దక్షిణ ఒడిశా ఆయుర్వేదిక్ వికాశ పరిషత్ నిర్ణయించింది. ఆదివారం స్థానిక శ్రీనివాస ఆయుర్వేదిక్ భవనంలో పరిషత్ కార్యదర్శి కవిరాజ్ పరమేశ్వర పాత్రో అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ధన్వంతరి జయంతి సందర్భంగా జయపురం గీతా భవనంలో వైదిక నీతి, నియమాలతో పూజలు, యాగ, యజ్ఞాలు నిర్వహించాలని నిర్ణయించారు. అనంతరం అన్న ప్రసాద సేవ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ సుదర్శన్ గౌడ, కవిరాజ్ క్షేత్రవాసి పండ, బైద్య సత్యనారాయణ పరిచ్ఛ, సూర్యనారాయణ మిశ్ర, త్రిపతి సాహు, బైద్య కాళీచరణ మహరాణ, సౌమ్య రంజన్ బెహర, హరి గౌడ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆదివాసీలపై దాడులు ఉపేక్షించం

● ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగీశ్వరరావు


మాట్లాడుతున్న వాబ యోగీశ్వరరావు

జలుమూరు: ఆదివాసీలపై దాడులు చేస్తే సహించేదిలేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగీశ్వరరావు అన్నారు. ఆదివారం ఎస్టీ మాకివలసలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 133 ఏళ్లుగా ఇదే గ్రామంలో జీవనం సాగిస్తున్న ఆదివాసీల హక్కులకు భంగం కలిగించడం అన్యాయమన్నారు. ఇక్కడ వివాదంలో ఉన్న భూమిపై జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ సందర్శించి ఆదివాసీలకు రక్షణ కల్పించాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ అధికారులు తీరు సరిగ్గా లేదని ఆరోపించారు. హరేకృష్ణ సంస్థ ముసుగులో కొంతమంది, అధికార పార్టీలో మరికొందరు ఇబ్బందులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. రాత్రిపూట కొంత మంది స్వాములు వచ్చి గ్రామం మీద దాడి చేయడం అమానుషమన్నారు. జిల్లా ఎస్పీ పూర్తిస్థాయి విచారణ చేసి దాడిచేసిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీలకు అన్యాయం చేస్తే రాష్ట్రస్థాయిలో ఆదివాసీలంతా కలిసి అధికార పార్టీ నాయకుల ఇల్లు ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈయనతోపాటు ఆదివాసీ సంఘం ప్రతినిధులు గురడి అప్పన్న, జిల్లా అధ్యక్షులు రాజు, పాపారావు, శాంతారావు, లక్ష్మి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీ మాకివలసలో 144 సెక్షన్


గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ రామారావు

జలుమూరు: మర్రివలస పంచాయతీ ఎస్టీ మాకివలసలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని, ఇరువర్గాలు సంయమనం పాటించాలని తహసీల్దార్ జెన్ని రామారావు అన్నారు. ఆదివారం నరసన్నపేట సీఐ కె.శ్రీనివాసరావుతో కలిసి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివాదంలో ఉన్న భూమిలోకి ఎవరూ పోవద్దని హితవుపలికారు. శనివారం రాత్రి జరిగిన వివాదంలో ఇరు వర్గాలపై కేసులు నమోదు చేశామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ రాష్ట్ర పరిషత్ ఉపాధ్యక్షుడు వాబ యోగీశ్వరరావు, జలుమూరు ఎస్ఐ అశోక్‌బాబు సిబ్బంది పాల్గొన్నారు.

టైపిస్ట్, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా అరుణ్‌కుమార్


అరుణ్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆంధ్రప్రదేశ్ టైపిస్టు, స్టెనోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన కె.అరుణకుమార్ ఎన్నికయ్యారు. రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం గుంటూరులో నిర్వహించారు. ఇందులో శ్రీకాకుళం తహసీల్దారు కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న అరుణకుమార్‌ను రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన టైపిస్టులు, స్టెనోగ్రాఫర్లు హర్షం వ్యక్తం చేశారు.

అనుమతి పత్రాలు లేకుండానే సీనరీస్ వసూళ్లు!


ఏఎంఆర్ సంస్థ ఏర్పాటు చేసిన మైనింగ్ చెక్‌పోస్టు

పొందూరు: మండలంలోని క్వారీ, క్రషర్ వాహనాల నుంచి సీనరీస్ వసూళ్లకు సంబంధించి పలు ఆరోపణలు వినిపిస్తున్నాయి. నాలుగు రోజులుగా క్వారీల నుంచి రాయి తీసుకువెళుతున్న వాహనాలకు, క్రషరీల నుంచి తరలిస్తున్న వాహనాలకు ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులు పలు గ్రామాల వద్ద మైనింగ్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వసూలు చేస్తున్నారు. యూనిట్ రాయి చిప్స్‌కు రూ.720, యూనిట్ రాయిబుగ్గికి రూ.500, యూనిట్ ఎర్రమట్టికి రూ.320 చొప్పున వసూలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం నుంచి అనుమతులు విశ్వసముద్ర పేరుపై ఉన్నట్లు ఏఎంఆర్ ప్రతినిధులు చూపిస్తున్నారు. మీరెందుకు వసూలు చేస్తున్నారని ప్రశ్నిస్తుంటే ఎవరు వసూలు చేస్తే మీకేంటని తిరిగి బెదిరింపులు చేస్తున్నారని వాహన యజమానులు చెబుతున్నారు. దీనిపై మైనింగ్ అధికారులను ప్రశ్నించగా జిల్లాలో సీనరీస్ కాంట్రాక్ట్ ఏఎంఆర్ సంస్థకు ఇచ్చారని, ఇంకా అనుమతి పత్రాలు రాలేదని, త్వరలోనే వస్తాయని చెప్పారు. ఎటువంటి స్పష్టమైన అనుమతి పత్రాలు లేకపోయినా వసూళ్లు ఆగటం లేదని క్రషరీ, క్వారీ యజమానులు ఆరోపిస్తున్నారు.

వివాహ వేడుకలకు వేళాయెె!



● అక్టోబర్ నుంచి డిసెంబర్ 23 వరకు శుభ గడియలే
● జిల్లాలో రెండు వేల వివాహాలు జరుగుతాయని అంచనా
● ఊపందుకున్న అనుబంధ వ్యాపారాలు

శ్రీకాకుళం కల్చరల్: కల్యాణ గడియలు వచ్చేశాయి. మూఢం, ఆషాఢం ముగియడంతో ముహూర్తాల సందడి మొదలైంది. అక్టోబరు 12 నుంచి డిసెంబరు 31 మధ్య సుమారు 23 శుభముహూర్తాలు ఉండటంతో జిల్లాలో పెళ్లిళ్ల, అనుబంధ వ్యాపారాలు ఊపందుకున్నాయి. తర్వాత సంక్రాంతి పండుగ నెల కావడంతో మళ్లీ వచ్చే ఫిబ్రవరి వరకు ముహూర్తాల కోసం ఆగాల్సిందే. అందుకే ఈ ఏడాది దీపావళి తర్వాత పెద్ద సంఖ్యలో పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉంది. అదే సమయంలో ఉపనయనాలు, గృహప్రవేశాలు కూడా ఎక్కువగా జరుగుతాయని పండితులు అంచనా వేస్తున్నారు.

షాపింగ్ సందడి..

పట్టణాల్లో పెళ్లిళ్ల షాపింగ్ ఊపందుకుంది. భోజనాలు, క్యాటరింగ్, కల్యాణ మండపాలు, ఫంక్షన్‌హాల్స్, హోటల్స్, డెకరేషన్‌లకు ముందస్తు ఒప్పందాలు చేసుకుంటున్నారు. శుభలేఖల ప్రింటింగ్, ఫ్లెక్సీ ప్రింటర్స్, ఫొటోగ్రాఫర్లు, టెంట్ హౌస్, వంటమేస్త్రీలు,బ్యూటీషియన్లు, మెహందీ ఆర్టిస్టులు, పూలు అమ్మేవాళ్లు, మంగళవాయిద్యా కళాకారులు, డీజే మ్యూజిక్ నిర్వాహకులు.. ఇలా పెళ్లి వేడుకతో ముడిపడిన ప్రతి ఒక్కరికీ చేతినిండా పని దొరుకుతోంది. ఆర్థికంగా స్తోమత కలగవారు వెడ్డింగ్ ప్లానర్స్‌తో ఒప్పందం చేసుకుంటున్నాయి. సాధారణ, మధ్య తరగతి వారు కూడా తమ స్థాయికి తగ్గట్లు పెళ్లివేడుకలకు ఖర్చు చేస్తున్నారు.

తగ్గేదేలే..

ఎంగేజ్‌మెంట్, ప్రీవెడ్డింగ్, హల్దీ, రిసెప్షన్, పోస్టు వెడ్డింగ్ ఇలా అనేక దశలుగా పెళ్లి వేడుకలు రాజీపడకుండా నిర్వహిస్తున్నారు. ఈ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా సుమారు 2వేల వరకు పెళ్లిళ్లు జరిగే అవకాశాలు ఉన్నాయి. కల్యాణ మండపాలు రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకు అద్దెలు వసూలు చేస్తున్నారు. ఇక భోజనాల సంగతి సరేసరి. కొత్తకొత్త వెరైటీలకు ఎంత ఖర్చు పెట్టేందుకైనా వెనుకాడటం లేదు. పెళ్లి దుస్తుల షాపింగ్‌కు ఒక్కొక్కరు రూ.50వేలకు పైగా వెచ్చిస్తుండటంతో షాపింగ్‌మాల్స్ కళకళలాడుతున్నాయి. పెళ్లి వేడుకలో ముఖ్యమైనది బంగారం. ధరలు పెరుగుతున్నా ఆభరణాలు తమ స్థాయికి తగ్గట్లు కొనుగోలు చేస్తుండటంతో షాపులు కళకళలాడుతున్నాయి.


పెళ్లి మండపం

ముహూర్తాలు మొదలు..



ఈ ఏడాది మూడు నెలలు మూఢం వల్ల అనుకున్నంత మేర వివాహాలు జరగలేదు. ఇప్పుడు శుభ ముహూర్తాలు మళ్లీ మొదలు కావడంతో పెళ్లిళ్లు ఎక్కువగా జరుగుతున్నాయి.

– పి.నర్సింహమూర్తి, పురోహితులు, శ్రీకాకుళం

శుభ ముహుర్తాలివే..

● అక్టోబరు 12, 13, 16, 20, 27
● నవంబర్ 3, 7, 8, 9, 10, 13, 14, 16, 17
● డిసెంబరు 5, 6, 7, 8, 11, 12, 14, 15, 2

మద్యం మత్తుకు.. రెండు నిండు ప్రాణాలు బలి

● ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన లారీ
● ఘటనా స్థలంలో ఇద్దరు మృతి
● డ్రైవర్ మందు తాగి నడపడం వల్లే ప్రమాదం!
● జిల్లోడువలసలో విషాదఛాయలు


ఘటనా స్థలంలో భవ్యశ్రీ మృతదేహం


రామారావు మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువు


భవ్యశ్రీ (ఫైల్)

నరసన్నపేట:

జాతీయ రహదారిపై మద్యం మత్తులో లారీ నడిపిన లారీ డ్రైవర్ రెండు నిండు ప్రాణాలను బలి తీసుకున్నాడు. సత్యవరం బైపాస్ రోడ్డుపై ముందు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. మృతులు పోలాకి మండలం జిల్లోడువలసకు చెందిన నక్క రామారావు(48), తియ్యాల భవ్యశ్రీ(17)లుగా గుర్తించారు. గుంటూరు నుంచి కోల్‌కతాకు మిరపకాయల లోడుతో ఈ లారీ వెళ్తోంది. ప్రమాదం జరిగిన సమయంలో డ్రైవర్ పూర్తిగా మద్యం మత్తులో ఉంటూ తూలుతూ కనిపించాడు. స్థానికులు దాడి చేస్తారని భావించి పరుగులు తీసి పోలీసు స్టేషన్‌కు వెళ్లినట్లు తెలుస్తోంది.

పావు గంటలో ఇంటికి చేరాల్సిన వేళ..

నక్క రామారావు, తియ్యాన భవ్యశ్రీలు శ్రీకాకుళం సమీపంలోని పరదేశీపాలేంలో బంధువుల వివాహానికి వెళ్లి తిరిగిద్విచక్ర వాహనంపై జిల్లోడువలసకు వస్తున్నారు. మరో పావు గంటలో ఇంటికి చేరుకుంటారనగా సత్యవరం బైపాస్ రోడ్డు వద్ద ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో వాహనం వెనక కూర్చున్న భవ్యశ్రీ శరీరభాగాలు నుజ్జయ్యాయి. బండి నడుపుతున్న రామారావు కొన ఊపిరితో ఉండటంతో స్థానికులు ఆసుపత్రికి తరలించేందుకు సిద్ధమయ్యేలోగా మృతి చెందాడు. నిరుపేద కుటుంబాలకు చెందిన వీరు రైతు కూలీలు. రామారావుకు భార్య ముత్యాలమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భవ్యశ్రీ స్థానిక జ్ఞాన జ్యోతి జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ఫస్టియర్ చదువుతోంది. ఇంటికి తొందరగా వెళ్లాలనే ఉద్దేశంతో పొరుగున ఉన్న రామారావుతో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తుండగా ప్రమాదానికి గురైంది. భవ్యశ్రీ తండ్రి గొరేసు, తల్లి నరసమ్మ, సోదరుడు లోకేష్ ఉన్నారు. పేద కుటుంబమైనా భవ్యశ్రీని అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. ఇంతలో ప్రమాదం సంభవించడంతో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సమాచారం తెలుసుకున్న వెంటనే నరసన్నపేట ఎస్ఐ సీహెచ్ దుర్గాప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకొని మృతుల వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వాహనాలు రోడ్డుపై లేకుండా ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

గర్భిణి ఆత్మహత్య

సాక్షి టాస్క్‌ఫోర్స్: బూర్జ మండలం వావాం గ్రామానికి చెందిన నాలుగు నెలల గర్భిణి రౌత్ అఖిల (20) శ్రీకాకుళం రిమ్స్‌లో వైద్యం పొందుతూ ఆదివారం వేకువజామున మృతి చెందిందని గ్రామస్తులు తెలిపారు. ఈమె ఈ నెల 16న పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబీకులు స్పందించి 108 అంబులెన్సులో రిమ్స్‌లో చేర్పించారు. శనివారం రాత్రి వరకు అక్కడే వైద్యం అందజేశారు. మెరుగైన వైద్యం నిమిత్తం వేరే హాస్పటల్‌కు తీసుకువెళ్తామని కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తెచ్చారు. ఆదివారం వేకువజామున ఆమె మృతిచెందింది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. ఈ విషయమై తమకు ఎలాంటి సమాచారం అందలేదని పోలీసులు తెలిపారు. అఖిలకు భర్త దంతం నిరంజన్, 17 నెలల పాప ఉంది. ఈమె మృతితో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

కల్లుగీత కార్మికులకే రిజర్వ్ మద్యం దుకాణాలు


సమావేశంలో పాల్గొన్న శ్రీశయన సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రిజర్వు చేసిన మద్యం దుకాణాలను కల్లుగీత కార్మికులు సాధించుకోవాలని శ్రీశయన సంఘ నాయకులు అన్నారు. నూతన మద్యం పాలసీ 2024–26ను అనుసరించి మద్యం షాపుల ఎంపిక కోసం గీత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన ప్రత్యేక రిజర్వేషన్‌లో భాగంగా జిల్లాలో శ్రీశయన/ఇతర కల్లుగీత కమ్యూనిటీల ప్రతినిధులతో ఆదివారం నగరంలోని గురిటి పోలమ్మ ఆలయం ఆవరణలో జిల్లా శ్రీశయన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గీత కార్మికుల పది శాతం రిజర్వేషన్ జీవో రావాల్సి ఉందని, వచ్చిన వెంటనే దరఖాస్తు చేసుకోవడానికి వీలుగా సర్టిఫికెట్, ఆధార్, సొసైటీ మెంబర్ ఐడీలు, ఇతర పత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. సిండికేట్ నాయకులకు తలవంచకుండా 17 దుకాణాలను లాటరీలో గెలుపొందేలా ప్రణాళికలు రూపొందించాలని కోరారు. సమావేశంలో జిల్లా శ్రీశయన సంఘం అధ్యక్షుడు మెండ లాల్‌బహదూర్ శాస్త్రి, ప్రధాన కార్యదర్శి గూరు జగదీష్ (అబ్బు), కార్పొరేషన్ మాజీ చైర్మన్ డి.పి.దేవ్, రాష్ట్ర సంఘం అధ్యక్షుడు లోడ అప్పారావు, గుజ్జల శాంతేశ్వరరావు, బోగాది అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ శిక్షణ

నరసన్నపేట: ఫౌండేషన్ లిటరసీ న్యూమరసి(ఎఫ్ఎల్ఎన్) పేరిట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లోని 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2026 నాటికి 1, 2 తరగతుల పిల్లలందరికీ కనీసం చదవడం, రాయడం సంపూర్ణంగా రావాలనే ఉద్దేశంతో ఈ శిక్షణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. తెలుగు, గణితం, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో బోధనా మెలకువలపై నిష్ణాతులైన వారితో అవగాహన కల్పించనున్నారు. ఈ మేరకు జిల్లాలో 1050 మంది ఉపాధ్యాయులను ఎంపిక చేశారు. వీరికి 14 విడతల్లో శిక్షణ ఇస్తారు. మొదటి విడత శిక్షణా కార్యక్రమం ఈ నెల 21న ప్రారంభం కానుంది. ఒక్కో విడతలో 75 మందికి శిక్షణ ఇస్తారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయ సమీపంలోని మహాలక్ష్మీనగర్ కాలనీ వద్ద శ్రీ విశ్వవిజేత జూనియర్ కళాశాలలో ఈ శిక్షణ జరుగుతుంది. ఇందుకు జిల్లా నుంచి కేఆర్‌పీ, ఐదుగురు డీఆర్‌పీలకు ప్రత్యేక ట్రైనింగ్ ఇచ్చారు. శిక్షణను ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ తిరుమల చైతన్య కోరారు.

తమ్ముళ్ల కోసమే తాత్కాలికం!

● జిల్లాలో పలుచోట్ల ఇసుక రీచ్‌లు ప్రారంభం
● అధికారిక టెండర్లన్నీ రద్దు చేసిన కూటమి సర్కార్
● ఎడ్ల బండితో పాటు ట్రాక్టర్ల ద్వారా కూడా తీసుకెళ్లేందుకు అనుమతి


గోపాలపెంట ఇసుక రీచ్ వద్ద రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్(ఫైల్)

అరసవల్లి: తెలుగు తమ్ముళ్ల ఇసుక దందాకు రాష్ట్ర ప్రభుత్వం 'తాత్కాలిక' ఏర్పాట్లు చేసింది. జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరు ఇసుక రీచ్‌ల టెండర్లన్నీ రద్దు చేసినప్పటికీ.. మళ్లీ టెండర్ల ప్రక్రియ పూర్తయినంతవరకు తాత్కాలికంగా ఇసుకను ఎడ్ల బండితో పాటు ట్రాక్టర్ల ద్వారా కూడా తవ్వి తీసుకెళ్లేలా మైన్స్ శాఖ ఉన్నతాధికారులు సవరణ మార్గదర్శకాలను జారీ చేసింది. దీంతో తమ్ముళ్ల కళ్లలో ఆనందోత్సవాలు వెల్లివిరుస్తున్నాయి. ప్రజావసరాల దృష్ట్యా ఇసుకను సమీప ప్రాంతాల వరకు గత ప్రభుత్వ హయాంలో కూడా ఉచితంగా ఎడ్ల బండ్లపై రవాణాకు అనుమతి ఉండేది. అయితే తమ్ముళ్ల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్న సర్కార్ ఎడ్ల బళ్లతో పాటు ట్రాక్టర్లతో కూడా రవాణా చేసుకోండని అనుమతిచ్చింది. దీంతో తెలుగు తమ్ముళ్ల ఇసుక ఆగడాలకు అడ్డే లేకుండా సర్కార్ దారినిచ్చింది.

రద్దయిన రీచ్‌ల్లో తాత్కాలిక తవ్వకాలు..

జిల్లాలో అంబళ్లవలస, బూరవల్లి (గార), బట్టేరు, హయాతినగరం (శ్రీకాకుళం), నివగాం (కొత్తూరు), గోపాలపెంట (నరసన్నపేట) తదితర ఆరు రీచ్‌లకు ఈ నెల 15న టెండర్లు ప్రక్రియను జిల్లా స్థాయి ఇసుక కమిటీ ఆధ్వర్యంలో పూర్తిచేశారు. అయితే అన్ని టెండర్లు అమరావతి బడా వ్యాపారులకే దక్కడంతో తెలుగు తమ్ముళ్ల చాటున అధికార పార్టీ ఎమ్మెల్యేలు..రీచ్‌లన్నీ తమకే కావాలంటూ పట్టు పట్టడంతో..చేసేదేమీ లేక టెండర్లన్నీ రద్దు చేస్తూ సర్కార్ నిర్ణయించింది. దీంతో ఎక్కడికక్కడ ఇసుక టెండర్ల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో అంతవరకు ఇసుక రీచ్‌ల వద్ద తాత్కాలికంగా ఇసుక సరఫరాకు సర్కార్ చర్యలు చేపట్టింది. పేరుకే కూటమి ప్రభుత్వమైనప్పటికీ తెలుగు తమ్ముళ్లకు మాత్రమే ఈ ఇసుక దక్కేలా మార్గదర్శకాలున్నట్లుగా తెలుస్తోంది. ఇదే క్రమంలో జిల్లాలో ఇప్పటికే గోపాలపెంట, బూరవల్లి, అంబళ్లవలసలల్లో ఇసుక రీచ్‌లను కలెక్టర్ స్వప్నిల్ దినకర్, మైన్స్ డీడీ సి.మోహనరావుల ఆధ్వర్యంలోనే ప్రారంభించారు. మిగిలినవి కూడా ఒకటెండ్రు రోజుల్లో ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. దీంతో తమ్ముళ్ల ట్రాక్టర్లతో ఇసుక రవాణాకు రెడీ అయ్యారు. ప్రజల నుంచి ట్రాక్టర్‌కు రూ.3వేలు నుంచి రూ.4 వేల వరకు ఇసుకకు రేటును నిర్ధారించి అమ్మకాలకు సిద్ధపడుతున్నారు. ఇదే క్రమంలో తమ సొంత స్థలాలు, తోటల్లో ఇసుకను భారీగా నిల్వలు ఉంచుకుని అక్రమ రవాణాలకు కూడా మార్గాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఇలా తవ్వుకో..దోచుకో..పంచుకో...విధానాన్ని అమలుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇదేం తీరంటూ సర్కార్ నిర్ణయాలపై జిల్లా వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా, జిల్లాలో ప్రస్తుతం రీచ్‌ల వద్ద తవ్వకాలను ప్రజావసరాల దృష్ట్యా మాత్రమే అనుమతించామని మైన్స్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

● తుఫాన్‌పై సమీక్ష


చీఫ్ సెక్రటరి అధ్యక్షతన తుపాను సమీక్ష సమావేశం

భువనేశ్వర్: రాష్ట్రంలో సంభవించనున్న తుఫాన్‌పై ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి మనోజ్ ఆహుజా ముఖ్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 23, 24 తేదీల్లో తుఫాన్ తీవ్రస్థాయిలో ఉంటుందనే సమాచారం నేపథ్యంలో అనుబంధ యంత్రాంగాల సన్నద్ధతపై సూచనలు చేశారు.

చైన్‌స్నాచర్.. కేరాఫ్ కంచరపాలెం


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ. వెనుక నిందితుడితో వన్ టౌన్ పోలీసులు

● ఒంటరి మహిళలే లక్ష్యంగా గొలును దొంగతనాలు
● జిల్లాలో చోరీ చేసి మెరుపు వేగంతో విశాఖకు పరార్
● రాష్ట్రవ్యాప్తంగా 30 చోరీల్లో ప్రధాన నిందితుడు
● 8.5 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : ఒంటరిగా రోడ్డుపై వెళ్తున్న మహిళలను లక్ష్యంగా చేసుకుంటాడు.. ఆమె పక్క నుంచే బైక్ పోనిచ్చి.. రన్నింగ్‌లోనే మెడలో చైన్‌లు తెంపేస్తాడు.. మరుక్షణమే 100 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో ఘటనాస్థలి నుంచి చెక్కేస్తాడు.. ఇదీ విశాఖపట్నం కంచరపాలేనికి చెందిన భీమరశెట్టి కమల్‌నాథ్ చైన్‌స్నాచింగ్ తీరు. రాష్ట్రవ్యాప్తంగా 30 చోరీల్లో కీలక నిందితుడై.. పదిసార్లు కటకటాల్లో మగ్గిన ఈ చోరుడు.. విడుదలైన వారం రోజుల్లోనే మూడు జిల్లాల్లో నాలుగు చోరీలు చేసి శ్రీకాకుళం పోలీసులకు చిక్కాడు. శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఆదివారం విలేకర్ల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. నిందితుడి నుంచి ఎనిమిదిన్నర తులాల బంగారు వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వివరాల్లోకి వెళ్తే..

చోరీలివే..

2023 అరిలోవ పోలీస్‌స్టేషన్‌లో ఓ కేసు విషయంలో అరెస్టయ్యి 11 నెలలు విశాఖపట్నం సెంట్రల్ జైల్‌లో శిక్ష అనుభవించి ఈ ఏడాది అక్టోబర్ 4న విడుదలయ్యాడు. అక్టోబరు 6న తూర్పుగోదావరి జిల్లా జగ్గంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో కాట్రావులపల్లి, సీతానగరం గ్రామాల మధ్య స్కూటీపై వెళ్తున్న మహిళ మెడలో మంగళసూత్రం (16.6గ్రాములు) తెంచేశాడు. అదేరోజు బిక్కవోలులో రోడ్డు వెంబడి నడుస్తున్న మహిళ మెడలో చైన్(రోల్డ్ గోల్డ్) చోరీ చేశాడు. అదే రోజు విజయనగరం జిల్లా డెంకాడ పీఎస్ పరిధి రఘుమండ గ్రామ కూడలి వైఎస్సార్‌కాలనీ వద్ద ద్విచక్రవాహనంపై వెనుక కూర్చుని ఉన్న మహిళ మెడలో రెండున్నర తులాల పుస్తెల తాడు తెంచి పరారయ్యాడు. అది కూడా రోల్డ్ గోల్డ్ కావడం గమనార్హం. అక్టోబరు 11న అరసవల్లి దేవాలయంవైపు వెళ్లి స్కూటీపై ఒంటరిగా వస్తున్న మహిళ మెడలో నాలుగున్నర తులాల బంగారు నల్లపూసల తాడు తెంచి పరారయ్యాడు.

చోరీ సొత్తు ఏం చేశాడంటే..

దొరికిన చోరీ సొత్తును విశాఖపట్నం మురళీనగర్‌లో ముత్తూట్ ఫైనాన్స్, కంచరపాలెం ఊర్వశి జంక్షన్‌లో ఉన్న ముత్తూట్ ఫైనాన్స్‌లో కమల్‌నాథ్ తండ్రి భీమరశెట్టి శ్రీరామమూర్తి పేరు మీద తాకట్టు పెట్టాడు. వచ్చిన సొమ్మును తండ్రీకొడుకులిద్దరూ పంచుకున్నారు.

వ్యసనాలకు బానిసై..

కమల్‌నాథ్ ఏడో తరగతి వరకే చదివి మధ్యలో ఆపేసి వ్యసనాలకు బానిసయ్యాడు. తండ్రికి మెకానిక్ షాపుండటంతో అక్కడే పనిచేసుకుంటూ తాళాలు లేకుండా వాహనాలు తీయడం నేర్చాడు. 2009 నుంచి బైక్‌లు దొంగిలించడం, మహిళల మెడలో చైన్లు, ఆభరణాలు మాయం చేసేవాడు. ఈ క్రమంలో మొదటిసారి సామర్లకోట రైల్వే స్టేషన్ దగ్గర బైక్ దొంగిలిస్తూ పోలీసులకు పట్టుబడ్డాడు. అరెస్టయి బయటకొచ్చాక మరిన్ని చైన్‌స్నాచింగ్‌లు చేశాడు.

ఎక్కడెక్కడ చేశాడంటే..

కంచరపాలెం, అనకాపల్లి, విజయనగరం టూటౌన్, శ్రీకాకుళం రూరల్, జామి, కొత్తవలస, అరిలోవ, అనపర్తి, ఎచ్చెర్ల, ఎయిర్‌పోర్టు, సబ్బవరం, గోపాలపట్నం పీఎస్‌ల పరిధిలో చోరీలు చేయగా 30 కేసులు నమోదయ్యాయి. ఇందులో పదిసార్లు నేరం రుజువై జైలుకెళ్లాడు.

డీఎస్పీ ప్రశంసలు..

సాంకేతికతను ఉపయోగించి నిందితున్ని చాకచక్యంగా పట్టుకున్న ఒకటో పట్టణ పీఎస్ కానిస్టేబుళ్లు ఎస్.రవికుమార్, ఆర్.సూరిబాబు, ఎం.జగదీష్, హరీష్, వై.రమణమూర్తిలను డీఎస్పీ వివేకానంద ప్రశంసించడమే కాక సీఐ పైడపునాయుడుతో రివార్డులు ఇప్పించారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాలతో స్పెషల్ టీమ్ ఇన్‌చార్జిగా ఉన్న సీఐ పైడపునాయుడు, ఎస్ఐ ఎం.హరికృష్ణ, ఏఎస్ఐ బి.రమేష్‌బాబులను అభినందించారు.

నేటితో టెట్ పరీక్షలు పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్ : ఈ నెల 3 నుంచి ప్రారంభమైన ఏపీ టెట్ – 2024 పరీక్షలు సోమవారంతో ముగియనున్నాయి. ఆదివారం ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వరా ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 100 మందికి 76 మంది, రెండో షిఫ్టులో 101 మందికి 94 మంది హాజరయ్యారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కాలేజ్‌లో మొదటి షిఫ్టులో 187 మందికి 163 మంది, రెండో షిఫ్టులో 185 మందికి 160 మంది హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించారు.

యూట్యూబ్ చూసి..చోరీలు చేసి..


పోలీసుల అదుపులో నిందితుడు

● తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు
● నిందితుడ్ని పట్టుకున్న పోలీసులు

సోంపేట : ఇంటి తాళాలు ఎలా సులువుగా తెరవచ్చో యూట్యూబ్‌లో చూసి పక్కా ప్లాన్ వేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుడిని సోంపేట పోలీసులు పట్టుకున్నారు. సోంపేట, మందస పోలీస్ స్టేషన్ పరిధిలో పలు చోరీలకు పాల్పడిన ఇతని వద్ద చోరీసొత్తును స్వాధీనం చేసుకున్నారు. సర్కిల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ మంగరాజు, ఎస్ఐ బి.హైమావతి ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. సోంపేట పట్టణానికి చెందిన కోల కిరణ్ పెయింటింగ్, సెంటరింగ్ పనులు చేస్తుండేవాడు. పేకాటకు బానిసయ్యాడు. ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో దొంగతనాల మార్గం ఎంచుకున్నాడు. మందస మండలం కొత్తపల్లి గ్రామంలో ప్రధాన రహదారి పక్కన ఇంటి తాళాలు పగలుగొట్టగా విలువైన వస్తువులు దొరకలేదు. సోంపేటలో తాను నివాసముంటున్న చిన్న కోమటివీధిలోనే తెలిసిన వారి ఇంట్లో చోరీ చేశాడు. ఈ నెల 13న మందస మండలం సొండిపూడిలో తాళాలు వేసిన రెండు ఇళ్లల్లో చొరబడినా విలువైన వస్తువులు దొరకలేదు. ఈ కేసుల్లో దర్యాప్తు చేపట్టిన పోలీసులు ఆదివారం కిరణ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద సుమారు రూ.2 లక్షల విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వీరులారా సెల్యూట్..!

విధి నిర్వహణలో చేసిన ప్రమాణానికి కట్టుబడి సవాళ్లను ఎదుర్కొన్నారు. సమస్యలపై సమరం సాగించారు. అసాంఘిక శక్తుల అంతు చూశారు. అరాచక మూకలను అణిచివేశారు. విధి నిర్వహణలో అమరులై చిరస్మరణీయులయ్యారు. వీరులారా మీ త్యాగనిరతి వృథాపోదు. నేడు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సాక్షి ప్రత్యేక కథనం.



- మరువలేనివి మీ త్యాగాలు
- అసాంఘిక శక్తులపై అలుపెరగని పోరు
- పోలీసు అమరవీరుల సంస్మరణ దినం నేడు




అమరవీరుల స్థూపం వద్ద పోలీస్ నివాళి

విజయనగరం క్రైమ్/పార్వతీపురంటౌన్: శాంతి భద్రతల పరిరక్షణలో నేలరాలిన వీర కిశోరాలెన్నెన్నో జిల్లాలో ఉన్నాయి. వారి జ్ఞాపకాలను మననం చేసుకుంటూ ఏటా అక్టోబరు 21న పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహిస్తూ, వారిని గుర్తు చేసుకుంటూ పోలీస్ సిబ్బంది నివాళులర్పిస్తున్నారు. అమరులైన పోలీసువీరుల జ్ఞాపకార్థం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన స్థూపాన్ని 2002 అక్టోబరు 21న అప్పటి ఎస్పీ సౌమ్యమిశ్రా ప్రారంభించారు. ఇక్కడ నిర్మించిన వేదికపై అమరవీరుల పేర్లను రూపొందించారు. అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటోంది. తక్షణ ఆర్థిక సాయం కింద రూ.9 లక్షలు, బీమా ద్వారా రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల వరకూ అందిస్తోంది. సర్వీసు కాలానికి పూర్తి జీతాన్ని చెల్లిస్తోంది. కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగావకాశం కల్పిస్తూ, 300 గజాల ఇంటి స్థలం మంజూరు చేస్తోంది. అమరవీరుల పిల్లలను ఆశ్రమ పాఠశాలల్లో చదివిస్తోంది. ప్రయాణ చార్జీల్లో 75 శాతం రాయితీ ఇస్తోంది.

అమరవీరులు వివరాలిలా..

ముద్దాడ గాంధీ



ముద్దాడ గాంధీ 1985లో ఆర్ఎస్సైగా చేరారు. 1991లో సివిల్ ఎస్సైగా జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేశారు. విధి నిర్వహణలో ధైర్య సాహసాలు ప్రదర్శించి మావోయిస్టులకు సింహస్వప్నంగా నిలిచారు. 2001 సెప్టెంబరు 28న ఒక కేసులో సాక్ష్యమిచ్చేందుకు సాలూరు కోర్టుకు వెళ్లినప్పుడు మావోయిస్టులు ఆయనపై అత్యంత కిరాతకంగా మెజిస్ట్రేట్ ఎదురుగానే కాల్పులు జరిపి హతమార్చారు. మావోయిస్టుల దొంగదొబ్బతో ఆయన సాలూరు న్యాయస్థానంలోనే ప్రాణాలు కోల్పోయారు. శాంతియుత సమాజ స్థాపన కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన ముద్దాడ గాంధీ త్యాగానికి ఎన్నిసార్లు శ్రద్ధాంజలి ఘటించినా తక్కువే అవుతుంది. ఆయన త్యాగ నిరతిని జాతి ఎన్నటికీ మరువలేదు.

సాలూరు కోర్టులో చిరంజీవిరావు



1985లో చిట్టిపంతులు చిరంజీవిరావు సివిల్ కానిస్టేబుల్‌గా చేరారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ముద్దాడ గాంధీ అంగరక్షకుడిగా వ్యవహరించేవారు. సాలూరు కోర్టు ఆవరణలో మావోయిస్టులు జరిపిన కాల్పుల్లో గాంధీతో పాటు ఆయన కూడా మృతిచెందారు.

మందు పాతర పేలుడులో ఇస్మాయిల్



షేక్ ఇస్మాయిల్ 1978లో ఆర్మ్‌డ్ కానిస్టేబుల్‌గా చేరారు. మోటార్ ట్రాన్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్‌లో డ్రైవర్‌గా పనిచేశారు. 2001 ఫిబ్రవరి ఒకటో తేదీన మావోయిస్టులు కురుపాం మండలంలో లోవలక్ష్మీపురం శివార్లలో ఓ కానిస్టేబుల్‌ను గాయపరిచి ఆయన వాహనాన్ని దహనం చేశారు. ఆ విషయాన్ని తెలుసుకుని పోలీస్ బృందం వెళ్తుండగా మందుపాతర పేల్చి, వారి వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటనలో షేక్ ఇస్మాయిల్ మతిచెందారు.

మందుపాతర పేలి సూర్యనారాయణ..



ఎస్. సూర్యనారాయణ 1993లో సివిల్ కానిస్టేబుల్‌గా చేరారు. స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి 2003 మే 30న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తుండగా పెద్దింటి జోల అనే ప్రాంతం వద్ద మావోయిస్టులు మందుపాతర పేల్చడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందారు.

మందు పాతర పేలి శ్రీరాములు..



బి.శ్రీరాములు 1993లో పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా చేరారు. సౌమ్యుడిగా గుర్తింపు పొందారు. 2001 ఫిబ్రవరి 1న లోవలక్ష్మీపురం గ్రామం వద్ద జరిగిన మందు పాతర పేలిన ఘటనలో మృతి చెందారు.

పోలీసుల సేవలు మరువలేనివి:ఎస్పీ



వకుల్ జిందాల్, ఎస్పీ, విజయనగరం

విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినాన్ని జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కార్యాలయం ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు, అదేవిధంగా ఈ నెల 31 వరకూ పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శాంతియుత సమాజం కోసం విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం కోల్పోవడం వారి త్యాగనిరతికి నిదర్శనమని కొనియాడారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ అక్టోబరు 21న జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో గల స్మృతివనంలో విధి నిర్వహణలో ప్రాణ త్యాగం చేసిన అమరవీరులకు ఘనంగా నివాళులర్పించనున్నామని పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ స్మృతిపరేడ్ నిర్వహించి, ర్యాలీ చేపడతామని తెలిపారు. అక్టోబరు 21 నుంచి 31 వరకూ జిల్లా వ్యాప్తంగా వివిధ సినిమా థియేటర్లలో పోలీసు ఇమేజ్‌ను రెట్టింపు చేసే విధంగా గుర్తింపు పొందిన సినిమాలను, వీడియో క్లిప్స్‌ను ప్రదర్శించేందుకు చర్యలు చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించినట్లు స్పష్టం చేశారు. అక్టోబరు 22 నుంచి 30 మధ్య జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తూ, విధి నిర్వహణలో మృతిచెందిన పోలీసు అమరవీరుల స్వస్థలాలను, వారు చదువుకున్న పాఠశాలలను పోలీస్ అధికారులు, సిబ్బంది సందర్శించి, పోలీసుశాఖకు వారందించిన సేవలను వివరిస్తామని తెలియజేశారు. అక్టోబరు 26, 27 తేదీల్లో జిల్లా కేంద్రం, బొబ్బిలి, చీపురుపల్లి సబ్ డివిజన్లలో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించి, పోలీసులు విధి నిర్వహణలో వినియోగించే వివిధ ఆయుధాలు, టెక్నాలజీ, నేర పరిశోధనలో డాగ్స్‌ను ఏ విధంగా వినియోగిస్తారన్న అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. అక్టోబరు 24 నుంచి 27 వరకూ జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లోనూ, జిల్లా కేంద్రంలోనూ రోల్ ఆఫ్ యూత్ ఇన్ ప్రివెన్షన్ ఆఫ్ సైబర్ క్రైమ్ అనే అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహిస్తామన్నారు. అక్టోబరు 28న పోలీసు కార్యాలయం ప్రాంగణంలో మెడికల్ క్యాంప్, రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో పోలీసు కుటుంబాలు, సిబ్బంది, ప్రజలు పాల్గొని వైద్యసేవలను పొందవచ్చని పిలుపునిచ్చారు. అక్టోబరు 29న జిల్లా వ్యాప్తంగా సబ్ డివిజన్ పరిధిలో ఉన్నపాఠశాలలు, కళాశాలల్లో పోలీసుల త్యాగాలు అనే అంశంపై సెమినార్స్ నిర్వహిస్తామన్నారు. అక్టోబరు 30న జిల్లా కేంద్రంలో యూనిటీ రన్ నిర్వహిస్తామన్నారు. సాయంత్రం మూడులాంతర్లు నుంచి కోట జంక్షన్ వరకూ క్యాండిల్ ర్యాలీ ఉంటుందని ప్రకటనలో ఎస్పీ వివరించారు. అలాగే పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రం పార్వతీపురంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎస్పీ ఎస్.వీ మాధవ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి కుటుంబాలను సన్మానించనున్నామని తెలియజేశారు.

క్లుప్తంగా

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక సాంస్కృతిక ప్రదర్శనలు



విద్యార్థినుల నృత్యప్రదర్శన

విజయనగరం టౌన్: స్థానిక పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా మూడు లాంతర్లు వద్ద ఉన్న చదురుగుడి ఆవరణలో ఆదివారం రాత్రి బీఎస్‌వై వైభవ లక్ష్మి బృందం చిన్నారుల నృత్యప్రదర్శన ఆద్యంతం ఆహుతులను ఆకట్టుకుంది. సామవేదుల సత్యలత భక్తిగీతాలు, వనంగుడి వద్ద వై.సాయిదుర్గాప్రసాద్ గిటార్ కచేరీ అలరించాయి. ఆలయ ఈఓ డీవీవీ.ప్రసాదరావు కళాకారులను ఘనంగా సత్కరించారు.


ఘోషా ఆస్పత్రిలో చిన్నారులకు పరామర్శ



పిల్లలను పరామర్శిస్తున్న కేసలి అప్పారావు

విజయనగరం ఫోర్ట్: విజయనగరంలోని ఘోషా ఆస్పత్రిలో డయేరియాతో చికిత్స పొందుతున్న గుర్ల గ్రామానికి చెందిన 11 మంది పిల్లలను రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు ఆదివారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆయన వెంట జిల్లాబాలల హక్కుల కమిటీ చైర్మన్ హిమబిందు, చైల్డ్ లైన్ ప్రతినిధి మీనాకుమారి తదితరులు ఉన్నారు.

ఆకెళ్ల మృతి సంగీతరంగానికి తీరని లోటు



ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ వార్షికోత్సవంలో వయోలిన్ వాయిస్తున్న ఆకెళ్ల (ఫైల్)

విజయనగరం టౌన్: ప్రఖ్యాత వయోలిన్ విద్వాంసుడు ఆకెళ్ల మల్లికార్జున శర్మ మృతి సంగీతరంగానికి తీరని లోటు అని ఫ్రెండ్స్ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ మండపాక రవి ఆదివారం ఓ ప్రకటనలో సంతాపం వెలిబుచ్చారు. హైదరాబాద్‌లో ఆదివారం ఉదయం ఆయన తుదిశ్వాస విడిచారు. సంగీతపరంగా విజయనగరంతో ఆయనకు ఎనలేని అనుబంధం ఉందని ప్రకటనలో గుర్తుచేశారు. 1970-80 ప్రాంతంలో అసోసియేషన్‌లో ఆయన అనేక సోలో కచేరీలు, పక్క వాయిద్య సహకారం అందించారని కొనియాడారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ధవళ సర్వేశ్వరరావు, ఉపాధ్యక్ష్యుడు దూసి శివరాం శర్మ, సలహాదారు పీఆర్‌కే.శాస్త్రి తదితరులు తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.


రాష్ట్ర స్థాయి డిస్క్‌త్రో పోటీలకు గురుకుల విద్యార్థిని



ప్రమీల

నెల్లిమర్ల: పట్టణంలోని మహాత్మాజ్యోతిబాపూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థిని ఎ.ప్రమీల రాష్ట్రస్థాయి డిస్క్‌త్రో పోటీలకు ఎంపికైంది. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో తాజాగా జరిగిన అండర్-19 జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో నిర్వాహకులు రాష్ట్రస్థాయి పోటీలకు ఆమెను ఎంపిక చేశారు. ప్రమీల సీఈసీ గ్రూప్ ఇంటర్మీడియట్ మొదటిసంవత్సరం చదువుతోంది. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రమీలను కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రమామోహిని, పీఈటీ కామేశ్వరి, ఇతర అధ్యాపకులు అభినందించారు.

ఆరుగురు జూదరుల అరెస్టు



పోలీసులు అరెస్టు చేసిన జూదరులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలో జూదం ఆడుతున్న ఆరుగురు నిందితులను నెల్లిమర్ల పోలీసులు ఆదివారం ఆరెస్టు చేశారు. స్థానిక టిడ్కో కాలనీ వద్ద జూదం ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు దాడిచేసి పట్టుకుని వారి నుంచి రూ.5520 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

నేడు తెప్పోత్సవం ట్రయల్ రన్

విజయనగరం టౌన్: నగరంలోని పెద్దచెరువులో తెప్పోత్సవం ట్రయల్ రన్ సోమవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో డీవీవీ ప్రసాదరావు ఓ ప్రకటనలో ఆదివారం తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు 40 మందితో ఈ ట్రయల్ రన్ చేపడుతున్నామన్నారు. పైడితల్లి సిరిమానోత్సవం పూర్తయిన మరుసటి రోజు అయిన మంగళవారం చేపట్టే తెప్పోత్సవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి అండర్9 చెస్ పోటీలు



చెస్‌పోటీల విజేతలతో రాష్ట్ర, జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు

విజయనగరం: చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో మూడు రోజులుగా జరుగుతున్న అండర్-9 ఓపెన్ బాల, బాలికల చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ మేరకు నగరంలోని ఆర్య ఫంక్షన్ హాల్‌లో జరిగిన పోటీలకు వివిధ జిల్లాలకు చెందిన 160 మంది క్రీడాకారులు హాజరుకాగా.. రౌండ్ల వారీగా సాగిన పోటీల్లో క్రీడాకారులు గెలుపు కోసం ప్రత్యర్థుల ఎత్తుకు పై ఎత్తు వేస్తూ విజయాన్ని కైవసం చేసుకున్నారు. పోటీల్లో బాలుర విభాగంలో సీహెచ్.ధాన్విన్ రామ్ (కాకినాడ), ఎం.శ్రీసాకేత్ (అనంతపురం)లు, బాలికల విభాగంలో వి.మోదితారెడ్డి (తిరుపతి), సీహెచ్.అనన్య (తూర్పుగోదావరి)లు ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. విజేతలకు ముఖ్య అతిథులు సర్టిఫికెట్లు, ట్రోఫీలు ప్రదానం చేశారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు డిసెంబర్‌లో పూణెలో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించనున్నట్లు ఏపీ చెస్ అసోసియేషన్ సీఈఓ కేవీ.జ్వాలాముఖి తెలిపారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి కేకే.జగన్నాథం, ఎన్.ఉమామహేశ్వరరావు, చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం సభ్యులు ఎం.గణేష్, కె.ధనలక్ష్మి, టి.అర్చన, ఎ.దామోదరరావు, కె.సురేష్‌లు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీలకు జిల్లా జట్ల పయనం



హిందుపురంలో వాలీబాల్ పోటీలకు పయనమైన విజయనగరం జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొనేందుకు వెళ్తున్న జిల్లా క్రీడాకారులు విజేతలుగా తిరిగిరావాలని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కేవీ.పిలుపునిచ్చారు. ఈనెల 21 నుంచి 23వ తేదీ వరకు అనంతపురం జిల్లా హిందుపురంలో జరగనున్న అంతర్ జిల్లాల అండర్-17 బాల,బాలికల వాలీబాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారులు ఆదివారం బయల్దేరారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి కృష్ణంరాజు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు జిల్లా నుంచి 12 మంది బాలురు, 12 మంది బాలికలు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించే క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఉత్తమ ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి కేవీఏఎస్ రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు ఏఎస్ఎం.కమలనాభరావు, నాగయ్య, బంగార్రాజు, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ గ్రానైట్ లీజు లైసెన్స్ రద్దు చేయాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలంలోని బడిదేవరకొండపై ఎంఎస్‌పీ గ్రానైట్ లీజు లైసెన్స్ అక్రమం, చట్టవిరుద్ధం, పర్యావరణ వ్యతిరేకమని రైతు సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు ఎం.కృష్ణమూర్తి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లీజు లైసెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం పార్వతీపురం పట్టణంలోని సుందరయ్య భవనంలో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఉమ్మడి కార్యాచరణ, పోరాటం చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం 2016లో ఎంఎస్‌పీ గ్రానైట్స్ కంపెనీకి బడిదేవరకొండపై గ్రానైట్ చేసుకునేందుకు ప్రభుత్వం లీజు లైసెన్స్ ఇచ్చిందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ సభలో ప్రజలందరూ వ్యతిరేకించినా గ్రానైట్ లైసెన్స్ ఎలా ఇచ్చారు? ఇది ఆనాటి పర్యావరణ చట్ట విరుద్ధమని ధ్వజమెత్తారు. ప్రభుత్వం లీజు లైసెన్స్ ఇవ్వడానికి వ్యతిరేకంగా గతంలో ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు ఉద్యమించాయని గుర్తు చేశారు. అటవీ శాఖ రిజర్వ్ ఫారెస్ట్‌కు చెందిన కొండపై లైసెన్స్ ఎలా ఇచ్చారని అభ్యంతరం చెప్పిందని ఫలితంగా ఫారెస్ట్, రెవెన్యూ ఉమ్మడి సర్వేలో బడిదేవరకొండ రిజర్వ్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌దేనని తేలిందన్నారు. ఆ తరువాత రాష్ట్ర ప్రభుత్వం ఏంఎస్‌పీ గ్రానైట్ కంపెనీకి ఇచ్చిన లీజు లైసెన్స్ 2017లో రద్దు చేసిందన్నారు. ఇపుడు మళ్లీ అది రెవెన్యూ కొండగా ఎలా మారింది? డబ్బుంటే దానికి అధికారం తోడైతే ఏదైనా సాధ్యమేని లైసెన్స్ వ్యవహారం రుజువు చేసినట్లుందని విమర్శించారు.

బడిదేవరకొండకు పూజలు

మండలంలోని ప్రజలంతా బడిదేవరకొండను దేవతగా విశ్వసించి పూజలు చేస్తారని అందువల్లనే వర్షాలు కురిసి పంటలు పండుతున్నాయని, ప్రజల నమ్మకమన్నారు. అందువల్లనే పార్వతీపురం మండలానికి సాగునీటి ప్రాజెక్టులు లేకపోయినా పంటలు పండుతాయని చెప్పారు. బడిదేవర కొండ గ్రానైట్ పార్వతీపురం ప్రాంతం పర్యావరణ దెబ్బతీసి పార్వతీపురం ప్రాంత రైతులు, గిరిజనులు, ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బంటు దాసు, రైతు కూలీ సంఘం రాష్ట్ర నాయకుడు పి.శ్రీను నాయుడు, సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు బి.నరసింగరావు ఈశ్వరరావు, సీపీఎంఎల్ లిబరేషన్ నాయకులు పి.సంగం, సీపీఐ పట్టణ నాయకుడు ఆర్‌వీఎస్ కుమార్, గిరిజన సంక్షేమ సంఘం నాయకుడు పి.రంజిత్ కుమార్, జనసేన పార్టీ పట్టణ నాయకులు పి.జయకృష్ణ, అన్నా బత్తుల దుర్గాప్రసాద్, వి.దాలినాయుడు, రెడ్డి వేణు, పి.సన్యాసిరావు, పి.రాముముత్యాలు, కె రామస్వామి, లక్ష్మణరావు శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నవంబరు 11లోగా ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు చెల్లించాలి

- జిల్లా వృత్తి విద్యా శాఖాధికారిణి మంజులవీణ

పార్వతీపురంటౌన్:

2025వ సంవత్సరం మార్చిలో జరగనున్న మొదటి, రెండవ సంవత్సరాల ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజును నవంబరు 11 లోగా చెల్లించాలని జిల్లా వృత్తి విద్యా శాఖాధికారిణి డి.మంజులవీణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం థియరీ పరీక్షల ఫీజు రూ.600, జనరల్, ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు అదనంగా రూ.275, బ్రిడ్జి కోర్స్ రాయాలనుకున్న విద్యార్థులు అదనంగా రూ.165, మొదటి, రెండవ సంవత్సరం (రెండు సంవత్సరాల బ్యాక్‌లాగ్ పేపర్లు) పరీక్షలు రాస్తున్న విద్యార్థులు రూ.1200, మొదటి, రెండవ సంవత్సరం (రెండు సంవత్సరాలు కలిపి)ఒకేషనల్ ప్రాక్టికల్స్ రాస్తున్న విద్యార్థులు రూ. 550 చెల్లించాలని ఆమె తెలిపారు. హాజరు మినహాయింపు (ప్రైవేట్) విద్యార్థులు రూ.1500 ఫీజు చెల్లించాలని స్పష్టం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించడానికి ఆఖరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చని తెలిపారు. రూ.1000 అపరాధ రుసుముతో నవంబర్ 20వ తేదీ వరకు ఫీజులు చెల్లించవచ్చని ఆమె పేర్కొన్నారు.

‘రియల్’ దగా..!

- సుమారు రూ.20 కోట్ల వరకు వసూలు
- బోర్డు తిప్పేసిన నిర్వాహకులు
- గగ్గోలు పెడుతున్న బాధితులు



రియల్ ఎస్టేట్‌లో ఇంటి స్థలం కోసం డబ్బులు కట్టి మోసపోయిన బాధితులు

వీరఘట్టం: పాలకొండ పరిసర ప్రాంతంలో అందమైన ఇంటిని కట్టుకోవాలనుకుంటున్నారా? అయితే మా వెంచర్లను సంప్రదించండి..సులభ వాయిదా పద్ధతిలో ప్రతి నెలా రూ.4000లు చొప్పున 50 వాయిదాలు చెల్లించి ఇంటి స్థలాన్ని మీ సొంతం చేసుకుని మీ కలలను సాకారం చేసుకోండని చేసిన ఓ రియల్ ఎస్టేట్ సంస్థ చేసిన ప్రచారంతో వందల మంది ఆకర్షితులై చివరికి మోస పోయారు. రియల్ ఎస్టేట్ నిర్వాహకులు ఏజెంట్ల ద్వారా సుమారు రూ.20 కోట్ల వరకు వసూలు చేసి బోర్డు తిప్పేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిపై బాధితులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.

పాలకొండకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ నిర్వాహకులు వారాడ రాజేంద్రనాయుడు, రేజేటి శేఖర్, అలజంగి శంకరరావులు తనను ఏజెంట్‌గా పెట్టుకుని సుమారు రూ.60 లక్షలు కాజేశారని వీరఘట్టానికి చెందిన పిన్నింటి వెంకటరమణ శనివారం ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు చేసి రియల్ ఎస్టేట్ నిర్వాహకులపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు. స్థానికులైన 41 మంది బాధితులు ప్రతి నెలా వాయిదాలు కట్టగా ఆ డబ్బులను నిర్వాహకులకు అందజేసినట్లు వెంకటరమణ ఫిర్యాదులో పేర్కొన్నాడు. వాయిదా కాలపరిమితి ముగిసినప్పటికీ ఇంటి స్థలాలు కేటాయించకుండా సదరు నిర్వాహకులు తప్పించుకు తిరుగుతున్నారని, వాయిదాలు కట్టిన వారు తనను నిలదీస్తున్నారని ఫిర్యాదులో ఏజెంట్ వెంకటరమణ వాపోయినట్లు ఎస్సై తెలిపారు. ఈ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కళాధర్ చెప్పారు.

చాలా రోజులుగా ఫిర్యాదులు

పాలకొండకు చెందిన ఓ రియల్ ఎస్టేట్‌లో డబ్బులు కట్టి, వాయిదాలు ముగిసినా సదరు నిర్వాహకులు ఇంటి స్థలం అప్పగించడం లేదని చాలా మంది బాధితులు చాలా రోజులుగా వీరఘట్టం, పాలకొండ పోలీస్‌స్టేషన్లలో మౌఖికంగా ఫిర్యాదులు చేస్తున్నారు. అయితే రాత పూర్వకంగా ఇంత వరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. చివరకు వీరఘట్టానికి చెందిన ఏజెంట్ వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు విషయం బయటకు వచ్చింది. బాధితులు మాత్రం ఏ ఏజెంట్ల వద్ద డబ్బులు కట్టారో వారిని నిలదీస్తున్నారు. ఆ రియల్ ఎస్టేట్ నిర్వాహకులు ఎవరో మాకు తెలీదు. మీకే డబ్బులు కట్టాం కాబట్టి మీరే బాధ్యత వహించి మా డబ్బులు తిరిగి ఇప్పించాలని ఏజెంట్లపై ఒత్తిడి తేవడంతో ఈ దందా వెలుగులోకి వచ్చింది. ఈ విషయంలో పోలీసులు తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కేసు నమోదు చేశాం..

వీరఘట్టానికి చెందిన పిన్నింటి వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదుపై రియల్ ఎస్టేట్ నిర్వాహకులపై శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.కళాధర్ తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ చేసి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

అధ్యాపకుడికి లెఫ్టినెంట్ ర్యాంక్



ఉదయ్‌కిరణ్‌కు లెఫ్టినెంట్ ర్యాంక్ బ్యాడ్జీ బహూకరిస్తున్న దృశ్యం

విజయనగరం అర్బన్: నగరంలోని సత్య డిగ్రీ కళాశాల అధ్యాపకుడు ముమ్మిడిశెట్టి ఉదయ్‌కిరణ్‌కు లెఫ్టినెంట్ ర్యాంకు వరించింది. కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకుడైన ఆయన ప్రీ కమిషన్(పీఆర్‌సీఎన్) ఎన్‌సీసీ కోర్సును విజయవంతంగా పూర్తి చేయడం ద్వారా లెఫ్టినెంట్ ర్యాంక్ సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సాయిదేవమణి ఆదివారం తెలిపారు. మహారాష్ట్రలోని కంపీలోని ఓటీఏ(ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ)లో 85 రోజుల కఠిన శిక్షణా కాలంలో ఆయన సెరిమోనియల్ డ్రిల్ విధానాలు, ఫిజికల్ ఫిట్‌నెస్ నియమాలు, ఫైరింగ్ అండ్ వెపన్ హ్యాండ్లింగ్, మ్యాప్ రీడింగ్, నావిగేషన్ అండ్ లీడర్‌షిప్, హెల్త్ అండ్ హైజీన్, పొజిషన్ ఆఫ్ ఫైరింగ్, టీమ్‌వర్క్ స్కిల్స్ వంటి అంశాల్లో విశేషమైన నైపుణ్యం సాధించారని పేర్కొన్నారు. ఈ మేరకు కళాశాల సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

బోధనేతర పనుల నుంచి టీచర్లను తప్పించాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈశ్వరరావు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో బోధనేతర పనుల నుంచి టీచర్లను తప్పించాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక శేషగిరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం జరిగిన యూటీఎఫ్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు మాట్లాడుతూ జీఓ 117 రద్దు చేసి పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ రెండు మీడియంలు నిర్వహించాలని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శత శాతం ఓట్లు నమోదు చేయించాలని, పాఠశాలల్లో బోధనేతర పనులు రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకు పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. జనవరి 5, 6, 7, 8 తేదీల్లో కాకినాడలో యూటీఎఫ్ స్వర్ణోత్సవ మహాసభలు, నవంబరు 17, 18 తేదీల్లో విజయనగరంలో జిల్లా స్థాయి మహాసభలు జరగనున్నట్లు తెలిపారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జేఆర్‌సీ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కె.విజయగౌరి, రాష్ట్ర నాయకులు ఇ.రాము, గౌరవాధ్యక్షుడు మీసాల అప్పలనాయుడు, సహాధ్యక్షులు వి.ప్రసన్నకుమార్, ఎ.పార్వతి, కోశాధికారి భాస్కరరావు మాట్లాడారు. సమావేశంలో అన్ని మండలాల అధ్యక్ష ప్రధానకార్యదర్శులతో పాటు ఆ సంఘ నాయకులు పాల్గొన్నారు.